## భార్యా భర్తలను బెదిరించిన ఇద్దరి రిమాండ్

ఎదులాపురం, జూన్ 9 : భార్యాభర్తలను బెదిరించిన కేసులో ఇద్దరిని 24 గంటల్లోపే మావల పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మావల సీఐ స్వామి వివరాలు వెల్లడించారు. ఆదివారం మావల మండలంలోని హరితవనం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పార్కులో బాధితురాలు దత్రక్ సంజీవిత ఆమె భర్త కమలేశ్వర్ విహరిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఇద్దరు అపరిచితులు వారిని అడ్డగించారు. భర్తపై దాడిచేసి, రూ.5వేలు నగదు లూటీ చేశారు. బాధితులు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచార ఆధారంగా నిందితులను విద్యానగర్ బస్టాండ్ ప్రాంతంలో కారం సంతోష్ (34) పల్లపు దుర్గయ్య (59)ను పట్టుకున్నారు. విచారణలో నిందితులు చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నగదు రూ.1500 స్వాధీనం చేసుకున్నారు. మిగతా డబ్బును మద్యం కోసం ఖర్చు చేశామన్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన కారం సంతోష్‌పై గతంలో నేర చరిత్ర ఉందన్నారు.

## వారంరోజులు బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాలు

ఎదులాపురం, జూన్ 9 : ఈ నెల 12వ తేదీ ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి సంబంధించి ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయాలని, పిల్లలను దోపిడీ నుంచి రక్షించాలని, జిల్లాలో బాల కార్మికులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇక్కడ జిల్లా సంక్షేమాధికారి కే మిల్కా, డీసీపీవో రాజేంద్రప్రసాద్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఐసీపీఎస్, డీసీపీయూ స్వామి, పద్మ, సిబ్బంది ఉన్నారు.

## సేవలు అభినందనీయం

ఎదులాపురం, జూన్ 9: కంటికి చికిత్సలకు శేషన్న చెన్నవార్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం మావలలోని శేషన్న చెన్నవార్ ఐ సెంటర్ 20వ వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి ఎస్పీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రోగులకు సేవలు అందించిన ఉద్యోగులకు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వైద్యులు ఇద్రిస్ అక్బానీ, ఐ సెంటర్ వైద్యుడు డాక్టర్ నేహాయాదవ్, డాక్టర్ రోహిత్, డాక్టర్ సుదద్రా జలాలీ, నరేశ్ రావు తదితరులున్నారు.

## ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, జూన్ 9: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ శాఖకు సంబంధించిన కరపత్రాలను డీఎస్సీడీవో భగత్ సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్,డీబీసీడీవో కె.రాజలింగు, ఇతర జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి కే మిల్కా, ఎస్‌డబ్ల్యువో నారాయణరెడ్డి,ఎస్సీ కార్యాయం సిబ్బంది ఉన్నారు.

## బీర్సా ముండాకు ఘన నివాళి

ఎదులాపురం/బోథ్, జూన్9: బీర్సాముండా వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం రైల్వే స్టేషన్ ఎదుట గల బీర్సా ముండ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇక్కడ హీరసుఖ ఆదివాసీ జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడం రాంకిషన్, నాయకులు కుర్సెంగ తానజీ, కొడప సోనేరావ్, పెందూర్ మోహన్, మేస్రం సుధాకర్, గేడం జనార్ధన్ తదితరులున్నారు. సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో బీర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ ఏరియ కమిటీ కార్యదర్శి లంకరాఘవులు, సభ్యులు ఎన్ స్వామి, కే ఆశన్న, ఆదివాసీ జిల్లా నాయకులు ఆత్రం సక్కు, తదితరులున్నారు.

సొనాల మండల కేంద్రంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్యాక్రమంలో మెస్రం భూమన్న, లాలూ రామ్, రమేశ్, గాజుల పోతన్న, సుభాష్ సూర్య, మాశెట్టి విద్యాసాగర్, అమృతరావ్, షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఒకరి అరెస్టు

ఎదులాపురం, జూన్ 9: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జైనథ్‌కు చెందిన (నిందితుడు) పోతిపల్లి ప్రశాంత్ డీఆర్డీవోలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ పట్టణంలోని శ్రీరామ్ కాలనీ చెందిన (బాధితుడు) పులిమామిడి కృష్ణచారి వద్ద రూ.రెండు లక్షలు బేరానికి కుదుర్చుకొని రూ.లక్ష ఇచ్చాడు. మోసం చేశాడనే ఫిర్యాదుతో ఫిబ్రవరిలో పోతిపల్లి ప్రశాంత్‌పై కేసు నమోదుచేశారు. ఈ ఘటనలో నిందితుడి వద్ద మోసపోయిన ప్రజలు ఇంకా ఎవరైనా ఉన్న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. ఇతనిపై క్రైమ్ నెంబర్ 58/25 తో అండర్ సెక్షన్ 318 (4) బీఎన్ఎస్‌తో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశామని తెలిపారు.

## నిర్మల్‌లో భారీ వర్షం

నిర్మల్ అర్బన్, జూన్ 9 : నిర్మల్ పట్టణంలో సోమవారం రాత్రి ఈదురుగాలు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆటోపై భారీ వృక్షం పడడంతో ఆటోలో ఉన్న నలుగురు ప్యాసింజర్లకు గాయాలు అయ్యాయి. దీంతో వారిని స్థానికులు 108లో జిల్లా దవాఖానకు తరలించారు. జేసీబీ సహాయంతో ఆటోపై పడిన చెట్టును తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి.

ఉట్నూర్, జూన్9 : ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై చెట్టు పడడంతో ట్రాఫిక్‌కు, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులు పలు గ్రామాలలో ఇంటిపై కప్పులను నేలమట్టం చేశాయని అధికారులు పేర్కొన్నారు.

## వర్కర్ల వేతనాలు పెంచాలని పీవోకు వినతి

ఉట్నూర్, జూన్9 : ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న పీటీడబ్ల్యూ, శానిటేషన్ వర్కర్ల వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమశాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు కేబీసీ నారాయణ ఆధ్వర్యంలో పీవోకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమాల్లో పనిచేస్తున్న పీటీడబ్ల్యూ, శానిటేషన్ వర్కర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, నాయకులు రాంచందర్, రాజలింగు, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలు త్వరగా పరిష్కరించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



అర్జీలు స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 9: ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతున్న దృష్ట్యా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చర్యలు చేపట్టాలన్నారు. స్కూళ్లు, హాస్టళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం డబ్బులు రైతులకు వెంటనే చెల్లించాలి

జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మద్, బామ్ని గ్రామంలో ఎఫ్‌పీసీఎల్ సంస్థ నుంచి మక్క ఆరు లారీల లోడ్ సుమారు 3,751 బస్తాలు కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఇందుకు సంబంధించిన రూ.40 లక్షల 96 వేల,858 రైతులకు ఇంతవరకు చెల్లించలేదన్నారు. వెంటనే రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రైతులు



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మాదిగ సామాజిక కులస్తులు

## అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు

జిల్లాలోని లక్ష్మణచాంద మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో ఒకే సామాజిక వర్గం వారు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నారని మాదిగ కులస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయమై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

## అక్రమాలపై విచారణ జరపాలి

ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ సంఘం డైరెక్టర్ బలాష్టు రాజన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1994లో మహ్మద్ నబీ సంఘంలో సబ్ స్టాఫ్ ఉద్యోగం చేస్తూ రెండు పేర్లతో చలామణి అవుతున్నాడని ఆయన ఆరోపించారు. ఈ విషయమై సంఘం సమావేశంలో చెప్పినా చైర్మన్, సీఈవో, డీసీవో పట్టించుకోలేదన్నారు. విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

## ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఆరోగ్యమిత్రలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంబంధించిన ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు అయిపోవడంతో వేతనాలు నిలిచిపోయాయని, ఔట్‌సోర్సింగ్ ఏజన్సీ పీరియడ్ పెంచి రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి




ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎదులాపురం, జూన్ 9 : ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అధికారులు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఇక్కడ మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీదేవి, రాంబాయి, లక్ష్మీ, ఉశ తదితరులున్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించలేదని ధర్నా




ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కేశపట్నం గ్రామస్తులు

ఎదులాపురం, జూన్ 9 : తమ గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించలేదని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని కేశపట్నం గ్రామస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చోడ మండలంలోని కేశపట్నం గ్రామానికి 28 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వే చేసి అర్హులను గుర్తించారని గ్రామస్తులు తెలిపారు. అయితే ఫైనల్ లిస్టులో మాత్రం అర్హుల పేర్లు కనిపించడం లేదన్నారు. ఇదే విషయమై ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, మాజీ సర్పంచ్‌ను అడిగితే తమకు సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామంలో ఉన్న అర్హులకు ఇందిరమ్మ మంజూరు చేసేల చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు షాహిద్, అల్తాఫ్, షేక్ ఫరీద్, మూసా, మహ్మద్, నజీర్, హసన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

## 27 ఏండ్లకు ఒక్కచోట చేరిన విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిర్మల్ అర్బన్, జూన్ 9 : నిర్మల్ పట్టణంలోని శ్రీస్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాల 1998–99 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 27ఏండ్ల తర్వాత విద్యార్థులందరూ ఒక్కచోట చేరి అప్పటి మధుర క్షణాలను ఒక్కసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్, దేవేందర్, ఉపాధ్యాయులు మనోహర్, రవీందర్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, విఠల్, తుకారాం, సునంద, రాధ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నర్సాపూర్ (జీ)/కుభీర్/తానూర్/తాంసి, జూన్ 9 : సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు సోమవారం జిల్లాలో పలుచోట్ల ఎంపీడీవోలకు వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ యొక్క దీర్ఘ కాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## హాకీ పోటీలు వాయిదా

ఎదులాపురం, జూన్ 9 : ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు ఈదురు గాలులు వర్షం వలన వాయిదా వేస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ వచ్చిరాగానే ఈదురుగాలులు, ప్రారంభం కాగా అప్పుడే అక్కడి తిరిగి వెళ్లారు.

## యూనిఫామ్‌ల పంపిణీ

నార్నూర్, జూన్9: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే పాఠశాలలకు యూనిఫామ్‌లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐకేపీ ఏపీఎం మైస రమేశ్ ,ఎంఈవో పవార్ అనిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు యూనిఫామ్‌లను అందించారు. ఇక్కడ సీసీలు సంతోష్, కిషన్, శ్రీరామ్, మహిళ టైలర్ అనసూయ ఉన్నారు.

## రాష్ట్ర మంత్రి వర్గంలో మున్నూరు కాపులకు అన్యాయం

ఎదులాపురం, జూన్ 9 : రాష్ట్ర మంత్రి వర్గంలో మున్నూరు కాపులకు అన్యాయం జరిగిందని మున్నూరు కాపుల పక్షాన రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగ్ రావ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న జనాభా మున్నూరు కాపులకు కానీ ఒక్క మంత్రి పదవి కూడా ఎవ్వలేదన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధి కోసం మంత్రి పదవి కేటాయించాలన్నారు.

## ఉపాధ్యాయులను పంపొద్దు

బోథ్, జూన్ 9 : సొనాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటులో పంపకుండా చూడాలని మండల నాయకులు సోమవారం డీఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు తక్కువగా ఉండడం వల్ల నలుగురు ఉపాధ్యాయులు సర్దుబాటులో వెళ్లిపోయే అవకాశం ఉందన్నారు. ఈ సర్దుబాటు వల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బడిబాట కార్యక్రమంలో పిల్లలు నమోదు జరుగుతుందన్నారు. ఇక్కడ నాయకులున్నారు.

## కాంగ్రెస్‌ను వీడే యోచనలో మాజీ సర్పంచ్‌లు

లోకేశ్వరం, జూన్ 9 : లోకేశ్వరం మండలానికి చెందిన ముగ్గురు మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీని వీడే యోచనలో ఉన్నట్లు సోమవారం తెలిపారు. లోకేశ్వరం, హవర్గా, హద్‌గాంలకు చెందిన మాజీ సర్పంచ్‌లు కపిల్, భుజంగ్ రావు, భీమ్‌రావులకు కాంగ్రెస్ పార్టీలో సరైన ప్రాధాన్యత లభించకపోవడంతో పార్టీని వీడి వేరే పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. వీరితోపాటు మరికొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇదే జరిగితే మండలంలో కాంగ్రెస్ పార్టీ కోలుకోలేని విధంగా నష్టపోతుందని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

## గోదాంలో భారీగా మంటలు

ఎదులాపురం, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో సోమవారం సాయంత్రం భారీ మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం రైల్వేగేట్ సమీపంలోని స్వస్తిక్ జిన్నింగ్‌లో ఏర్పాటు చేసిన గోదాంలో మంట లు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారుల మంటలను అదుపులోకి తెచ్చా రు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

## అనుమతుల్లేకుండా విత్తనాల అమ్మిన ఒకరి అరెస్ట్

- రెండు లక్షల విలువ గల విత్తనాలు స్వాధీనం

ఎదులాపురం, జూన్ 9 : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అమాయక రైతులకు విత్తనాలు అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెల్లూరి ఆలయ సమీపంలోని ఓ షాపులో రైతులకు విత్తనాలు అమ్ముతున్న గోలి మనోజ్‌ను టాస్క్ ఫోర్స్ బృందం దాడులు చేసి పట్టుకుందన్నారు. రూరల్ ఏవో నాగేష్ రెడ్డి, ఆర్ఐ నారాయణ విచారణ చేపట్టగా ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా అమ్ముతున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ మేరకు వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. అతని వద్ద ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అమ్ముతున్న 229 విత్తనాల ప్యాకెట్లు, రెండు నకిలీ విత్తనాల ప్యాకెట్లు, సుమారుగా రూ.2 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎదులాపురం, జూన్ 9 : రిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన వృద్ధురాలికి సోమవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా అంతక్రియలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపురం భగత్ సింగ్ నగర్ కాలనీకు చెందిన సూరం రాజేశ్వరి(50) గత నెల 31న అనారోగ్యంతో రిమ్స్ దవాఖానలో చేరి, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ విషయాన్ని పేరిమల సరిత ఏడీపీ నెట్వర్క్ ప్రెసిడెంట్ పేరిమల సరిత మానవసేవే మాధవసేవ సమితి, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీకు సమాచారం అందించారు. మంచిర్యాల జిల్లాకు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుమారుడు, కూతురుతో కలిసి స్వచ్ఛంద సంస్థలు కలిసి ఆదిలాబాద్‌లోని అంతక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మానవసేవే మాధవ సేవ సమితి సభ్యులు శ్రీపద్వార్ శ్రీనివాస్, సభ్యులు హన్ శశికళ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), చిందం దేవిదాస్ (ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్), జాదవ్ శ్రావణ్ నాయక్ (న్యాయవాది), నైతం శుక్లాల్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉమా, రమ సాయినాథ్ పాల్గొన్నారు.

## 77 కిలోల గంజాయి దహనం

ఎదులాపురం, జూన్ 9: జిల్లాలో నమోదైన 14 గంజాయి కేసుల్లో పట్టబడ్డ 77కిలోల 781 గ్రాముల గంజాయిను డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్ వద్ద గంజాయి దహనం చేశారు. కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్సీ సీహెచ్ నాగేందర్, ఎస్ఐ హకీమ్‌లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



స్వర్ణలో బీఆర్ఎస్ కార్యకర్త అక్కలి సృజన్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 9 : స్వర్ణ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అక్కలి సృజన్ తండ్రి, ప్యారమూర్ గ్రామానికి చెందిన రమణ తల్లి, బీరవెల్లి గ్రామానికి చెందిన వంగ నారాయణరెడ్డి తల్లి ఇటీవల మరణించగా సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు దేవిశంకర్, నాగుల రాంరెడ్డి, లక్ష్మన్, మల్లేశ్, లక్ష్మీనారాయణగౌడ్, శ్యామ్‌రెడ్డి, భోజన్న, రవి, లక్ష్మణ్, లింగారెడ్డి, సురేష్, రాజు, ప్రవీణ్ తదితరులున్నారు.

## 'ఉద్యోగోన్నతితో బాధ్యతలూ పెరుగుతాయి'



ఇద్దరు మహిళా అధికారులను అభినందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 9 : ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయని, కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్ఐ నుంచి సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరు మహిళా అధికారులు జే అంజమ్మ, డీ పద్మను ఎస్పీ అఖిల్ మహాజన్ మహిళా అధికారులకు భుజాలపై ఉద్యోగోన్నతి చిహ్నం స్టార్‌ను అలంకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది జైస్వాల్ కవిత, వామన్ పాల్గొన్నారు.

## బాధ్యతగా విధులు నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, జూన్ 9 : పాఠశాలలో సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సెక్టోరియల్ అధికారి సలోమీ కరుణ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కేజీబీవీ పాఠశాలలో జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలు, మోడల్ స్కూల్, యూఆర్ఎస్ తదితర పాఠశాలల్లో పనిచేసే శానిటేషన్ సిబ్బంది, ఏఎన్ఎంలకు శిక్షణ హైదరాబాద్‌లో శిక్షణ పొందిన డీఆర్పీవీలు పాఠశాల నిర్వహణ తీరుపై శిక్షణ ఇచ్చారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వో సుజాత, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే దీక్షలు

భైంసా, జూన్, 9 : బుద్ధ – అంబేద్కర్ ఐడల్ ప్రొటక్షన్ కమిటీ ముథోల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాళ్ల బోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని పున ప్రతిష్టించాలని కోరారు. వీరికి సంఘీభావం తెలిపిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దగ్డే కపిల్, యశ్వంత్ బన్సోడే, శ్రీనివాస్‌లు ఉన్నారు.

## కరాటే క్రీడాకారులకు గ్రేడింగ్ పరీక్షలు

నిర్మల్ అర్బన్, జూన్ 9 : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ...ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తేజేందర్ సింగ్ బాటియా, కొండాజి శ్రీకాంత్, చందుల స్వామి, శ్రీకాంత్, మనీషా, శేఖర్, చిరంజీవి, పావని, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 9: ఈ నెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 2,19,972 రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. మూడు నెలలకు సరిపడా 13,285,623 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అన్ని రేషన్ దుకాణాలలో ఇదివరకే నిల్వ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా రేషన్ షాపు డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రెండు ఇసుక లారీల పట్టివేత

తానూర్, జూన్, 9 : అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ట్రెయినీ ఎస్ఐ నవనీత్‌రెడ్డి తెలిపారు.ఎస్ఐ వివరాల ప్రకారం, ఆదివారం రాత్రి భైంసా నుంచి తానూర్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలో బాలాజీ గుట్ట వద్ద రెండు లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమంగా ఇసును తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

భైంసా, జూన్, 6 : పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన చంద్రకాంత్ (45) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే, గీతా కాటన్ ఫ్యాక్టరీలో ప్రైవేట్ ఎల్మక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని వెంటనే ఏరియా దవాఖానకు తరలించారు.

## విద్యుత్ షాక్‌తో ఉద్యోగికి తీవ్రగాయాలు

సోన్, జూన్ 9: నిర్మల్ మండలంలోని అక్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 220 కేవీ విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఉద్యోగికి కరెంటు షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం, నలుగురు ఉద్యోగులు పొట్టం దేవన్న, రాకేశ్, సత్తయ్య, కిరణ్ కలిసి విద్యుత్ ఫీడర్ చెడిపోవడంతో ఎల్‌సీ తీసుకొని మరమ్మతులు చేస్తుండగా మరో ఫీడర్ వైర్ పొట్టం దేవన్నకు తగలడంతో తీవ్ర గాయాలతో కిందపడిపోయాడు. వెంటనే ఆయనను నిర్మల్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

నర్సాపూర్ (జీ), జూన్, 9 : మండలంలోని నందన్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలయ్యాయి. వివరాలి ఉన్నాయి.. దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన దంపతులు బుచ్చన్న (45) భార్య పేరు కళావతి (42) శనివారం లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామంలో గల చెల్లెలి గృహ ప్రవేశానికి వెళ్లి ఆదివారం తిరిగి మధ్యాహ్నం ఇంటికి వస్తున్నారు. నందన్ ఎక్స్‌రోడ్డు వద్దకి వచ్చేసరికి మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ మహేశ్ నిర్లక్ష్యంగా ఎన్‌హెచ్ 61పై ఆపాడు. ఈ సమయంలో బుచ్చన్న మోటారు సైకిల్‌తో లారీని ఢీకొన్నాడు. దీంతో అతనికి రెండు చేతులు, నుదుటికి గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. సోమవారం బుచ్చన్న కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిరణ్ కేసు నమోదు చేసుకున్నారు.

## రైతులను మోసగిస్తే చర్యలు

ఉట్నూర్, జూన్9 : రైతుల వద్ద ట్రాక్టర్లను లీజుకు తీసుకొని అమ్ముతున్న దళారులపై చర్యలు తప్పవని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో రైతును మోసగించిన వారిపై కేసును నమోదు చేశామని పేర్కొన్నారు. రైతులకు రైతుబంధు సహాయంతో ట్రాక్టర్లను అందజేయడం జరిగిందన్నారు. అయితే కొందరు దళారులు రైతులకు మాయమాటలు చెప్పి మోసపూరితంగా మరొకరికి అమ్ముకుంటున్న వైనం తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామన్నారు.

## బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

ఎదులాపురం, జూన్ 9 : బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. కొన్ని నెలల కింద పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలు బంగారిగూడకు చెందిన షేక్ ముజ్జు వద్ద రూ.20 వేలు అధిక వడ్డీతో తీసుకొని పూర్తిగా డబ్బులు చెల్లించాడు. అయినప్పటికీ రూ.రెండు వేలు డబ్బులు ఇవ్వాలని ఈనెల ఆరున బంగారుగూడకు చెందిన షేక్ ముజ్జు, షేక్ సమీర్, షేక్ సలీం (రౌడీ షీటర్)లు కలసి బాలును వేధింపులకు గురిచేశారు. బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కార్, నాలుగు సెల్ ఫోన్‌లు, రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం

నిర్మల్ అర్బన్, జూన్ 9 : నిర్మల్ పట్టణంలోని శాస్త్రీనగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 352 పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ రమణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, అనుముల భాస్కర్, రమేశ్ రెడ్డి, వినయ్, సుధాకర్ తదితరులున్నారు.